క్లుప్తంగా

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

చిల్పూరు: అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తెలంగాణ సాంస్కృతిక సారధి టీం లీడర్ పిన్నమల్ల సాంబయ్య (గద్దర్) కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. శనివారం కలెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఆదేశాల మేరకు స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో కళాజాతా నిర్వహించారు. ఆటపాటల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీలు, గురుకుల పాఠశాలల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాకారులు బాలయ్య, శ్రీనివాసులు, చిరంజీవి, రవి, ఎడవెల్లి విజయ, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై యువత చైతన్యం పొందాలి

దేవరుప్పుల: సామాజిక రుగ్మతలపై యువత చైతన్యం పొందాలని పీఎస్సై రాజేందర్ సూచించారు. శనివారం రాత్రి చౌడూరులో సీపీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై ఊర సృజన్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సామాజిక అంశాలపై పోలీసు జాగృతి కళాకారులు ప్రదర్శనలు ఇచ్చి అవగాహన కల్పించారు. కళాజాతా బృందం ప్రతినిధి వీలియం, రత్నాకర్, కానిస్టేబుల్ యాకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలి



సంగమేశ్వర్ దంపతులను సన్మానిస్తున్న ఈఓ వంశీ తదితరులు

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని కొడవటూర్ దేవస్థాన ఆలయ కార్య నిర్వాహణాధికారి చిందం వంశీ తెలిపారు. శనివారం ఆలయంలో అర్చక విధులను నిర్వర్తించి పదవీ విరమణ పొందిన శ్రీమఠం సంగమేశ్వర్ దంపతులను శాలువా, మెమొంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి విధులు సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడు సేవలను గుర్తుంచుకుంటారని అన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, సదాశివుడు, మహాశివుడు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండ సీఎంఆర్‌ఎఫ్

నర్మెట: బడుగులకు ఆసరా, పేదలకు అండ సీఎంఆర్‌ఎఫ్ అని కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కన్నెబోయిన సత్తయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ. 10 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం లబ్ధిదారునికి అందజేసిన ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజ్ఞాపురం శ్రీధర్, యసర్ల అంజయ్య, వలబోజు శ్రీనివాస్, కన్నెబోయిన రామకృష్ణ, బండి అశోక్, ముక్కెర రాజేష్, తీగుళ్ల భూపతి, గొట్టె రాజశేఖర్, శివరాత్రి మహేష్, కొన్నె తిరుపతి, కొలెపాక స్వామి పాల్గొన్నారు.

అన్నదానం



జనగామ: పట్టణంలోని రాజరాజేశ్వరి అనాథ వృద్ధాశ్రమంలో పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ ఆధ్వర్యంలో శనివారం అనన్య, విక్షిత్, మహిశివాన్, సాన్వి నిహాన్షలు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోగు మహేందర్, జోగు భాస్కర్, కర్రె రాజశేఖర్, నరేంద్ర, రంజిత్, ఉదయ్, మద్దూరి రమేష్, నాలిన్ మను పాల్గొన్నారు.

అవతరణకు ముస్తాబు



విద్యుత్ దీపాల అలంకరణలో డీసీపీ కార్యాలయం

రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని డీసీపీ ఆఫీసుతో పాటు పట్టణ పోలీస్‌స్టేషన్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ దీపాల వెలుగుల్లో ప్రభుత్వ కార్యాలయాలు కాంతులీనుతున్నాయి.

-జనగామ

ఆదమరిస్తే అంతే..

- ప్రమాదాలకు నిలయంగా ప్రధాన రహదారులు
- అసంపూర్తిగా గానుగుపహాడ్ బ్రిడ్జి



కంకరతేలిన నర్మెట-జనగామ రహదారి



అధ్వానంగా ఉన్న వెల్దండ రోడ్డు



అసంపూర్తిగా ఉన్న గానుగుపహాడ్ బ్రిడ్జి

నర్మెట: నర్మెట ప్రధాన రహదారి కంకరతేలి, గుంతలమయంతో వాహన చోదకులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఆదమరిస్తే అంతే మరి అన్నచందంగా ద్విచక్రవాహనాలు అదుపుతప్పి చోదకులు నిత్యం గాయాల బారిన పడుతున్నారు. జనగామ నుంచి నర్మెట, హుస్నాబాద్‌ల మీదుగా కరీంనగర్‌కు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుండగా మండల కేంద్రం సమీపంలోని లో కాజ్‌వే పూర్తిగా కంకరతేలి ప్రమాదాలకు నిలయంగా మారింది. నర్మెట ఊర చెరువు మత్తడి పోస్తే ఈ కాజ్‌వే గుండానే నీరు నల్లచెరువులోకి చేరుతుండటంతో రోడ్డు మరింత కోతకు గురవుతుంది. కాగా, మండలకేంద్రం నుంచి వెల్దండకు వెళ్లే బీటీ రోడ్డు వెల్దండ చెరువు మత్తడి పోయడంతో గత ఏడాది కురిసిన వర్షాలకు కోతకుగురై ప్రమాదంగా మారింది. వాహనం ఏమాత్రం అదుపుతప్పినా లోతైన కాల్వలో పడిపోవాల్సిందే.. జనగామ-హుస్నాబాద్ రహదారిలో గత మూడేండ్ల క్రితం నిర్మాణం చేపట్టిన గానుగుపహాడ్ వాగుపై బ్రిడ్జి పిల్లర్ల దశలోనే ఆగిపోయి నేటికి పూర్తి కాలేదు. ప్రక్కనుండి పోసిన మట్టి దారి చిన్న వర్షాలకే కొట్టుకు పోవడంతో ప్రమాదకరంగా మారింది. వర్షాలకు వాగు ప్రవహిస్తే మట్టి రోడ్డు తెగి పోతే జనగామకు మరోదారి లేదు. జనగామ నుంచి కరీంనగర్‌కు ద్విచక్రవాహనాలు మొదలతాయిల్ ట్యాంకర్స్, మిల్క్ ట్యాంకర్స్, భారీ వాహనాలు, ఇసుక లారీలు, బస్సులు, కార్లు వందల సంఖ్యలో వెళ్తుంటాయి. ఈదారిలో వెళ్తే 88 కిలో మీటర్లు మాత్రమే. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలని పలుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాలు పోతేనే రోడ్డు బాగు చేస్తారా



ప్రాణాలు పోతేనే రోడ్లు బాగు చేస్తారా..పదుల సంఖ్యలో ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పలువురికి గాయాల కావడం, ఎదురుగా వచ్చే భారీ వాహనం కింద పడితే ప్రాణాలు పో వాల్సిందే. అధికారులు తక్షణం స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

- గూడ సేనారెడ్డి, నర్మెట

చీకటి పడితే ప్రమాదంగా..



ద్విచక్ర వాహనంపై జనగామ వెళ్లాలన్నా, తిరిగి రావాలన్నా చీకటి పడితే మరింత ఇబ్బందిగా ఉంది. ఎదురుగా వచ్చే భారీ వాహనాల లైట్ల వెలుతురుకు గుంతలు, కంకరతేలిన రోడ్డు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వానలు కురిస్తే మరింత ఇబ్బందిగా ఉంటుంది.

- కొన్నె కనకయ్య

త్వరలో మరమ్మతులు



గతంలో మరమ్మతు చేయించాం.. రోడ్డు నిలువలేదు. ఇరు వైపులా పొలాలు ఉన్నాయి. శాస్వత ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఉన్నతాధికారుల అనుమతితో కాంట్రాక్టరు ద్వారా త్వరలో మరమ్మతులు చేపడతాం.

- కోమరాజు భాస్కర్, ఏఈఈ, ఆర్ అండ్ బీ

అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఆర్డీఓ వెంకన్న



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 2న ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆర్డీఓ శనివారం ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సమీక్ష చేపట్టారు. అన్ని శాఖల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా చేపట్టేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు చేపట్టాల్సిన కార్యక్రమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. మండలంలోని శివునిపల్లిలోని సిరిపురం గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో వేడుకలను నిర్వహించనున్నామని, ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీ, ఎంఈఓ కొమురయ్య, ఐకేపీ ఏపీఎం కుమారస్వామి పాల్గొన్నారు.

'మంద కృష్ణతోనే మాదిగలకు ఆత్మగౌరవం'



దేవరుప్పుల: వరంగల్‌కు వెళ్తున్న నాయకులు

దేవరుప్పుల: ఎస్సీ ఉపకులాల ఆర్థిక అసమానతలను తొలగించేందుకు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన వర్గీకరణ ఉద్యమంతోనే మాదిగలకు ఆత్మగౌరవం పెరిగిందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహా అన్నారు. శనివారం ఓరుగల్లుకు పద్మశ్రీ పురస్కారంతో వస్తున్న మందకృష్ణకు ఘనస్వాగతం పలికేందుకు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ మండల నాయకులు జోగు మధుసూదన్, సుదర్శన్, కిరణ్, బి.నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలి

బచ్చన్నపేట: సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్ మాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రం నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకుని ఢిల్లీ నుంచి వరంగల్ వస్తున్న ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడారు. నాయకులు అల్వాల రాజు, రామదాసు, అంజయ్య, చిరంజీవి, కుమారస్వామి, మోహన్, సంపత్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు దారుణం

టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జయప్రకాశ్



మాట్లాడుతున్న జయప్రకాశ్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని, అభ్యసనాసామర్థ్యాలను పెంచాలని, అందుకు ఉపాధ్యాయులే బాధ్యులని చెప్పిన అధికారులు సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులు లేకుండా చేయడం దారుణమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ అన్నారు. ఘన్‌పూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఏటేటా తగ్గుతుందని, ఈ ఏడాది విద్యార్థుల నమోదు పెంపుకు సమిష్టిగా కృషి చేయాలని చెప్పిన విద్యాశాఖ అధికారులు ఏకపక్షంగా సర్దుబాటు ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అధికారుల మాటలు నమ్మి సామాజిక బాధ్యతగా వేసవి సెలవుల్లో విద్యార్థుల నమోదు కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచార జాతాలతో క్యాంపెన్‌లు నిర్వహిస్తున్నామని, అయితే వాటిని నీరుగార్చేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. విద్యార్థుల నమోదును పట్టించుకోకుండా ఈనెల 13వ తేదీ నాటికే సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించడం దారుణమన్నారు. ఈ విషయమై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు పునరాలోచించాలని, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- తహసీల్దార్లు

తరిగొప్పుల:భూ భారతి చట్టం అమలులో భాగంగా ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు మండల వ్యాప్తంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మందాడపు రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ యజమానులు, రైతులు తమ భూమి రికార్డులలో తప్పులు, అర్హత ఉండి రెవెన్యూ రికార్డులలో పేరు నమోదు లేకపోయినా, ఇతర సమస్యలు ఉన్నా ఈ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 3వ తేదీన నర్సాపూర్,4న అబ్దుల్‌నాగారం,5న బొంతగట్టునాగారం, 6న అంకుషాపూర్,9న సోలిపూరం, 10న పోతారం, 11న అక్కరాజుపల్లి,12న తరిగొప్పుల మండలకేంద్రంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

కొడకండ్ల: జూన్ 3 నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కోల చంద్రమోహన్ తెలిపారు. 3న రేగుల, 4న రంగాపురం, 5న నర్సింగాపురం, 6న ఏడునూతుల, 9న పాకాల, 10న రామవరం, 11న మొండ్రాయి, 12న లక్ష్మక్కపల్లి, 13న కొడకండ్లలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రఘునాథపల్లి: మండలంలోని రెవిన్యూ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 3వ తేది నుంచి 16 వరకు భూ భారతి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మోహ్సిన్‌ముజ్తబ తెలిపారు. శనివారం ఆయన గ్రామసభల వివరాలు వెల్లడించారు. రెండు టీంలుగా గ్రామాలకు వచ్చి గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. 3న ఫతేషాపూర్, కల్వపల్లి, 4న ఇబ్రహీంపూర్, కన్నాయిపల్లి, 5న నిడిగొండ, బానాజీపేట, 6న మాధారం, గబ్బెట, 9న వెల్ది, కంచనపల్లి, 10న రఘునాథపల్లి, కోడూర్, 11న మేకలగట్టు, శ్రీమన్నారాయణపురం, 12న ఖిలాషాపూర్, కోమల్ల, 13న అశ్వరావుపల్లి, గోవర్ధనగిరి, 16న కుర్చపల్లిలో గ్రామసభలు జరుగుతాయని రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ సూచించారు.

దేవరుప్పుల: అపరిష్కృతంగా నెలకొన్న భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తలపెట్టిన భూ భారతి చట్టం (2025) అమలులో భాగంగా రేపటి నుంచి ఊరూరా జరిగే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆడెపు అండాలు సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ భూ యజమానులు, రైతులు తమ భూమి రికార్డుల్లో ఏమైనా తప్పులు ఉన్నా, లేదా అర్హత ఉండి రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు కాకపోయినా, మరి ఇతర భూ సమస్యలు ఉన్నా తగు ఆధారాలతో దరఖాస్తులు చేసుకుంటే పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని సూచించారు. 3వ తేదీన గొల్లపల్లి, 4న ముస్‌పహాడ్, 5న రామరాజుపల్లి, 6న సీర్మాల, 9న సింగరాజుపల్లి, 10న మాధాపురం, 11 న ధర్మాపురం, 12 న కోలుకొండ, 13 న చౌడూరు, 16 న కడవెండి, 17 న చిన్నమడూరు, 18 న పెద్దమడూరు, 19వ తేదీన దేవరుప్పుల రెవెన్యూ గ్రామాల సదస్సుల వివరాలు వెల్లడించారు.

రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



పుట్టమట్టి తెచ్చేందుకు వెళ్తున్న కులపెద్దలు

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో మాదిగ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ మాదిగ కులపెద్దలు, దేవాలయ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా దేవాలయానికి ఆకర్షణీయంగా రంగులు వేయడంతో పాటు చలువపందిళ్లు వేశారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా వేదపండితులు జీడికంటి వరుణాచార్యులు, శ్రీహరి ఆచార్యులు ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్ష స్వీకరణ, అంకురార్పణం, అమ్మవారి విగ్రహానికి జలాధివాసం, క్షీరాధివాసం పూజలను ఘనంగా చేపట్టారు. అనంతరం కులపెద్దలు, దేవాలయ కమిటీ వారు డప్పుచప్పుళ్లతో వెళ్లి పుట్టమట్టి తేగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కాగా, ఉత్సవాలు ఈనెల 3వ తేదీ వరకు ఉంటాయని, 2న రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, 3న కల్యాణం, బోనాల పండుగ నిర్వహిస్తారని కుల పెద్దలు, దేవాలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపను పొందాలని వారు కోరారు.

బస్టాండ్‌లో వాటర్ ప్యూరిఫయర్ ఏర్పాటు



వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి, డీఎం స్వాతి తదితరులు

రఘునాథపల్లి: అశ్వరావుపల్లి పొట్లపల్లి కమల మనోహర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రఘునాథపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగు నీరందించేందుకు శనివారం వాటర్ ప్యూరిఫయర్ ఏర్పాటు చేశారు. జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, జనగామ డిపో మేనేజర్ స్వాతి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు రూ.70 వేల విలువగల వాటర్ ప్యూరిఫయర్ ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ప్రతినిధి పొట్లపల్లి కళాధర్‌రావును అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు రవికుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, ఆర్టీసీ సూపరింటెండెట్ యాదమణిరావు, సేఫ్టి వార్డెన్ కుర్ర సురేందర్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు కావటి ముత్యాల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ లైన్ పరిశీలన



విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న డీఈ రాంబాబు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని పాత సినిమా థియేటర్ సమీపాన నివాస గృహాల మీదుగా ప్రమాదకరంగా 33 కేవీ విద్యుత్ లైన్ ఉందని బాధితుల ఫిర్యాదు మేరకు ట్రాన్స్‌కో స్టేషన్ ఘన్‌పూర్ డీఈ రాంబాబు శనివారం స్వయంగా పరిశీలించారు. ఇండ్ల మీదుగా విద్యుత్ తీగలు ఉండటంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందిగా ఉందని, పిడుగులు పడిన సమయంలో ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని బాధితులు డీఈ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇందుకు డీఈ సానుకూలంగా స్పందిస్తూ మీ సమస్యను పరిశీలించేందుకు వచ్చామని, త్వరలో విద్యుత్ వైర్లను ఇళ్లకు దూరంగా మార్చేలా చర్యలు తీసుకుంటామని హామీ చేశారు. కార్యక్రమంలో ఏఈ శంకర్, లైన్‌మన్ వాసం శ్రీధర్‌పటేల్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

బచ్చన్నపేట: రామచంద్రాపురం గ్రామంలో మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు బొడిగం చంద్రారెడ్డి, ఆముదాల మల్లారెడ్డిలు మాట్లాడుతూ శిబిరంలో డాక్టర్ వెంకట్, వైద్య బృందం 520 మందికి పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారని తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ నరేష్‌కుమార్, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సభ్యులు భూపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, మహేంద్రవర్మ, యాకూబ్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయండి

డీఏఓ రామారావు నాయక్



మాట్లాడుతున్న డీఏఓ రామారావు నాయక్

బచ్చన్నపేట: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే సమస్యలు లేకుండా అభివృద్ధి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫర్టిలైజర్ షాపుల్లో నాణ్యమైన విత్తనాలను ఎంఆర్‌పీ ధరలకు రైతులకు విక్రయించేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని తెలిపారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు పోలీస్ కళాజాతాలు నిర్వహించాలన్నారు. బడిబాట ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికిషోర్, ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్, మండల వైద్యాధికారి సృజన, ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి, ఏఓ విద్యాకర్‌రెడ్డి, ఏపీఎం నాగేశ్వర్‌రావు, ఏపీఓ కృష్ణ, పీఆర్ ఏఈ సాయి రంజిత్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ కవిత, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబానికి పరామర్శ

జఫర్‌గఢ్: తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర మల్లయ్య ఇటీవల మృతి చెందడు. కాగా, శనివారం విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ బృందంతో కలిసి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెంతల రాజ్‌కుమార్, కడారి శంకర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

మండల కేంద్రానికి చెందిన ఠాకుర్ రాజ్‌కుమార్‌కు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.27 వేల చెక్కును రాజయ్య లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు. కోత్వాల కుమార్, కడారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లికి చెందిన మాజీ జెడ్పీటీసీ గుర్రం యాదగిరి తండ్రి గుర్రం గురవయ్య(90) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శివునిపల్లిలో గురవయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోశాల క్రిష్ణమూర్తి గురవయ్య మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన కురాం శంకరమ్మ-రాములు దంపతుల కూతురు కల్పన వివాహానికి సామాజిక సేవా కర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5 వేల సాయం శనివారం అందజేశారు. శ్రీనివాస్, కనుకయ్య, భాస్కర్, పర్శరాములు, నారాయణ, రాములు తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

బచ్చన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల పనులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జీపీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

టీపీసీసీ జిల్లా అబ్జర్వర్‌ను కలిసిన నాయకులు

తరిగొప్పుల: టీపీసీసీ జిల్లా అబ్జర్వర్ బైకాని లింగం యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల సమస్యలు, అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆయనతో చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ అర్జుల సుధాకర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్, దాసుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానవతా విలువలు నేర్పాలి

- డీఈఓ భోజన్న



ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈఓ భోజన్న

లింగాలఘణపురం: విద్యార్థులకు చదువుతో పాటు మానవతా విలువలు నేర్పాలని డీఈఓ భోజన్న అన్నారు. జిల్లాలోని ఫిజిక్స్, సైన్స్ ఉపాధ్యాయులకు నెల్లుట్ల ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ శిబిరంలో శనివారం ఆయన మాట్లాడారు. ఆడపిల్లలు దేశ భవిష్యత్‌ను నిర్ణయించే స్థాయికి ఎదిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలని, సెల్‌ఫోన్ వినియోగం తగ్గించేలా విద్యార్థులకు వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ చీఫ్ ఆపరేటివ్స్ ఆఫీసర్ ఆంథోనిరెడ్డి, జీసీడీఓ గౌసియాబేగం, ఏఎంఓ శ్రీనివాస్, సురేశ్‌కుమార్, రాము ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



వరిధాన్యం తేమశాతం పరిశీలిస్తున్న డీఎస్‌ఓ సరస్వతి

స్టేషన్‌ఘన్‌పూర్: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు డీఎస్‌ఓ సరస్వతి సూచించారు. స్థానిక ఐకేపీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. రైతులు ఆరబోసుకున్న ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. అనంతరం సెంటర్ నిర్వాహకులు, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. లారీలు, గన్నీబ్యాగుల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని సెంటర్‌కు తీసుకువస్తే తేమశాతంతో ఇబ్బంది ఉండదని, చివరిగింజ వరకూ కొనుగోలు చేస్తామని చెప్పారు.

రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

జనగామ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా చందునాయక్ డిమాండ్ చేశారు. రిజర్వ్ బ్యాంకు నిబంధన ప్రకారం బ్యాంకు డిపాజిట్ల నుంచి 18 శాతం నిధులను రైతులకు పంట రుణాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఈనెల 5, 6 తేదీల్లో బ్యాంకుల ఎదుట తలపెట్టిన ధర్నాకు సంబంధించి కరపత్రాలను సంఘం కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం దేశ రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గిట్టుబాటు ధరల గ్యారంటీ చట్టం తక్షణమే చేయాలన్నారు. ఈ మేరకు 11న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, మంగ భీరయ్య, మాచర్ల సారయ్య, రామవత్ మీట్యానాయక్, బోడ రాములు, నక్క యాకయ్య, కర్రె రాములు,, సుధాకర్ పాల్గొన్నారు.